క్లుప్తంగా

వైభవంగా గ్రామోత్సవం



సుబ్రమణ్యేశ్వర స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు

పాణ్యం: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వర స్వామి ఉత్సవ మూర్తులకు గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈఓ రామకృష్ణ, ఆలయ జీర్ణోద్ధరణ కమిటీ చైర్మన్ మిలటరీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో గ్రామోత్సవం చేపట్టారు. ముందుగా శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వర స్వామి సమేత ఉత్సవ మూర్తులకు ప్రత్యే పూజలు నిర్వహించారు. అనంతరం సుందరంగా అలంకరించిన పల్లకీల్లో సామివారి ఉత్సవమూర్తులను ఉంచి మేళ తాళాల నడుమ గ్రామంలోని పురవీధుల గుండా ఊరేగించారు. ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, అర్చకులు నారాయణస్వామి, సురేష్, కిట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు



ఉలిందకొండలో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

కల్లూరు: సంక్రాంతి పండుగ సందర్భంగా కల్లూరు గ్రామీణ, అర్బన్ ప్రాంతాల్లో నిర్వహించిన ముగ్గుల పోటీలలో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. రంగవల్లులతో వివిధ రకాలుగా ఆకట్టుకునే ముగ్గులు వేశారు. పోటీలలో విజేతలైన వారికి ముగ్గుల పోటీల నిర్వాహకులు బహుమతులు ప్రధానం చేశారు.

హోరాహోరీగా కబడ్డీ పోటీలు



కబడ్డీలో తలపడుతున్న క్రీడాకారులు

ఓర్వకల్లు: మండలంలోని హుసేనాపురం గ్రామంలో నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు హోరాహోరీగా సాగాయి. గ్రామంలోని మీరసావలి నాసర్ షరీఫ్ ఉరుసు సందర్భంగా రెండు రోజుల పాటు జరిగిన పోటీలలో మొత్తం 20 జట్లు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందులో హుసేనాపురం తారక్ జట్టు ప్రథమ స్థానం సాధించి రూ.20 వేల బహుమతి దక్కించుకున్నట్లు పేర్కొన్నారు. ప్యాపిలి హంటర్ జట్టు రెండో స్థానంలో నిలిచి రూ.15 వేలు, మూడో బహుమతి రూ.10 వేలను శకునాల జట్టు, నాలుగో బహుమతి రూ.5 వేలను నంద్యాల మండలం , సాంబవరం జట్టు సాధించినట్లు పేర్కొన్నారు. ఈ పోటీలకు భూపతిరావు, రామదాసు, ఇమామ్ వలి, పూజారి బజార్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. గెలుపొందిన జట్లకు దాతలు సాయంత్రం బహుమతులను ప్రదానం చేశారు. నిర్వాహకులు శ్రీనివాసులు, గువ్వరవి, కురువ దస్తగిరి, మాబులాల్, సుధాకర్, రామగోవిందు తదతరులు పాల్గొన్నారు.

తెలంగాణ మద్యం పట్టివేత



తెలంగాణ మద్యంను స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ పోలీసులు

కర్నూలు (టౌన్): అక్రమంగా తరలిస్తున్న తెలంగాణ మద్యాన్ని ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులు బుధవారం పట్టుకున్నారు. స్థానిక కల్లూరు ఎస్టేట్‌లోని వెంకట చలపతి నగర్‌కు చెందిన బోయ రమణమ్మ అనే మహిళ వద్ద తెలంగాణ మద్యం ఉన్నట్లు సమాచారం అందడంతో ఎక్సైజ్ పోలీసులు దాడులు చేశారు. ఆమె వద్ద 11 ఫుల్ బాటిళ్లు 13 క్వార్టర్ల మాన్షన్ హౌస్ బ్రాందీ బాటిళ్లు దొరికాయి. నిందితురాలిపై కేసు నమోదు చేశారు. అలాగే కర్నూలు నగరంలోని బంగారుపేటలోని నాటుసారా స్థావరాలపై దాడులు చేశారు. నీలి షికారి శాంతమ్మ అనే మహిళ వద్ద 10 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకొని ఆమెను అదుపులోకి తీసుకున్నట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ చంద్రహాస్ వెల్లడించారు. దాడుల్లో సబ్ ఇన్‌స్పెక్టర్ రెహెనా బేగం, నవీన్‌బాబు సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ

కృష్ణగిరి (వెల్దుర్తి): స్థానిక బాలుర హైస్కూల్ మైదానంలో ఈనెల 16వ తేదీ నుంచి జిల్లా స్థాయి సూపర్–8 క్రికెట్ టోర్నమెంట్ జరుగనుంది. 2000–01 బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ టోర్నీ విన్నర్స్‌కు రూ.20వేలు, రన్నర్స్‌కు రూ.10వేలు అందజేయనున్నారు. ఎంట్రీఫీజు రూ.500తో గురువారం 10గంటలలోపు సెల్ 9052997711, 9391610171 నంబర్లలో సంప్రదించాలని నిర్వాహకులు సురేశ్, శ్రీను, సుమన్, రాహుల్, అనూప్, సూరి, ముత్యాల సుమన్ బుధవారం తెలిపారు.

ఊరూరా సంక్రాంతి సంబరాలు

ఓర్వకల్లు: సంక్రాంతి పర్వదినం సందర్భంగా మంగళవారం మండలంలోని కేతవరం, ఓర్వకల్లు గ్రామాలలో మహిళలకు పలు రకాల ఆటల పోటీలు నిర్వహించారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు, కుర్చీలాట, తాడు లాగే పందెం, యువతకు ట్రాక్టర్ రివర్స్, ఆటో రివర్స్ పందేలు నిర్వహించారు. సీఐటీయు మండల కార్యదర్శి శ్రీధర్, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకుడు సుధాకర్ అధ్యక్షతన జరిగిన పోటీలకు మహిళా సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు ధనలక్ష్మి, వ్య.కా.స జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. ప్రజలంతా టీవీలు, సెల్‌ఫోన్‌లకు పరిమితమై ఎవరికి వారు సంబంధం లేకుండా తయారవుతున్న తరుణంలో ఇలాంటి ఆటల పోటీల వల్ల మానవ సంబంధాలు పెరుగుతాయన్నారు. అనంతరం పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. గ్రామ పెద్దలు నాగేశ్వరరెడ్డి, వెంకటేశ్వర్లు, రంగస్వామి, మహిళా సంఘం నాయకులు లలితమ్మ, నాగమ్మ, పద్మావతి, ప్రజా సంఘాల నాయకులు రామకృష్ణ, కేశాలు, ఎల్లరాజు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గడివేముల: మకర సంక్రాంతి, కనుమ పండగలను మంగళ, బుధవారాల్లో మండల ప్రజలు సంప్రదాయబద్ధంగా, ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఏ ఇల్లు చూసినా కూతుర్లు, అల్లుళ్లు బంధువులతో సందడి వాతావరణం కనిపించింది. ప్రతి ఇంటా పిండి వంటలు ఘుమఘుమలాడాయి. గంగిరెద్దుల కోలాహలం కనిపించింది. మహిళలు వేకువజామునే స్నానమాచరించి, ఇంట ముంగిట ముగ్గులు వేసి అందులో గొబ్బెమ్మలను పెట్టి గౌరీదేవి వ్రతాలను ఆచరించారు. మంచాలకట్ట గ్రామంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. మండలంలోని మూల పెద్దమ్మ ఆలయం, బాలాజీ టెంపుల్, గని బృందావనం, వంటి ప్రముఖ ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. గడిగరేవుల గ్రామంలో శ్రీదుర్గా భోగేశ్వర స్వామి ఉత్సవమూర్తులను ఈఓ రామానుజన్, ప్రధాన అర్చకులు శ్యా మ సుందర శర్మ ఆధ్వర్యంలో ఊరేగింపు చేశారు. అనంతరం పారువేటకార్యక్రమం ఘనంగా నిర్వహించారు.



ఓర్వకల్లు: విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న వ్య.కా.స నాయకులు నాగన్న



పాణ్యంలో ఉత్సవ మూర్తుల ఊరేగింపు



ఓర్వకల్లు: ముగ్గుల పోటీలలో పాల్గొన్న మహిళలు

కోడుమూరులో...

కోడుమూరు రూరల్: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని మూడు రోజుల పాటు కోడుమూరు, గూడూరు మండలాల ప్రజలు ఘనంగా వేడుకలు జరుపుకున్నారు. భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను ప్రజలు కుటుంబ సభ్యులతో ఆనందంగా జరుపుకున్నారు. మూడు రోజుల పాటు పోటీలు పడి మహిళలు తమ ఇంటి ముంగిళ్లలో అందమైన రంగవళ్లులు తీర్చిదిద్దారు. ఎక్కడెక్కడో సుదూర ప్రాంతాల్లో ఉన్న ఉద్యోగులు, విద్యార్థులు, యువతీ, యువకులు సొంతూళ్లకు రావడంతో గ్రామాల్లోని ఏ ఇల్లు చూసినా పండుగ వాతావరణం నెలకొంది.



కోడుమూరులో అందమైన రంగవల్లిని తీర్చిదిద్దిన మహిళలు

తిమ్మందొడ్డి నదిలో సంక్రాంతి సంబరాలు

సి.బెళగల్: మండల పరిధిలోని తిమ్మందొడ్డి గ్రామస్తులు తుంగభద్ర నదిలో సంక్రాంతి సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. మకర సంక్రాంతి సందర్భంగా మంగళవారం సాయంత్రం గ్రామ ప్రజలు తుంగభద్ర నదిలోని శ్రీ నందీశ్వరులున్న బండ దగ్గరికి చేరి స్వాముల వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నదిలో ఏర్పాటు చేసిన తినుబండారాలను, చెరకులను కొనుగోలు చేశారు. గ్రామ యువతీ యువకులు, చిన్నారులు ఒకరికొకరు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలుపుకుంటూ సంబరంగా గడిపారు. వైస్ ఎంపీపీ బీసమ్మ, గ్రామ సర్పంచ్ నాగలక్ష్మి, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాణ్యం: సంక్రాంతి పండుగ పర్వదినం సందర్భంగా గత రెండు రోజులుగా గ్రామాల్లో పండుగ శోభ సంతరించుకుంది. ముగ్గుల పోటీలతో వేడుకలు ప్రారంభంకాగా గ్రామస్థాయిలో పలు రకాల క్రీడలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. మహిళలు పోటీ పడి రంగురంగుల ముగ్గులను వేసి ఆకట్టుకున్నారు. బుధవారం పండుగ ముగియడంతో ఉత్సవ మూర్తులను ఊరేగించారు. తెల్లవారుజామున ఆలయాలకు చేరుకున్న భక్తులు గ్రామ దేవతలకు పూజలు చేశారు.

– మండల పరిధిలోని తమ్మరాజుపల్లె గ్రామంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి ప్రోత్సాహక బహుమతులను అందించారు. అలాగే 50 సంవత్సరాల వయసున్న పురుషుల పరుగు పందెం పోటీ నిర్వహించగా గ్రామానికి చెందిన కోడె శేషయ్య మొదటి స్థానంలో నిలవడంతో నగదు ప్రోత్సాహకం అందుకున్నారు.

– కొండజుటూరు గ్రామంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని రంగరంగుల ముగ్గులు వేశారు. ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందించారు.

– పాణ్యంలో దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఉత్సవ మూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు. మేళతాళలతో గ్రామంలోని పురవీధుల్లో స్వామివారిని ఊరేగించగా ప్రజలు కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



గడివేముల: పారువేట ఉత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

మార్మోగిన భైరవ నాదం



మల్లందొడ్డి స్వామి వారి ఉత్సవాల్లో గొరవయ్యల సందడి

సి.బెళగల్: మండల పరిధిలోని గొల్లలదొడ్డి గ్రామంలో గత మూడు రోజుగా జరుగుతున్న మల్లందొడ్డి స్వాముల వారి ఉత్సవాలు బుధవారంతో ముగిసినట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామంలోని కణ్యాల గోత్రం కురువ కులస్తులకు మహిమాన్వితుడిగా విరాజిల్లుతున్న స్వామి వారికి మంగళ, బుధవారాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలను శక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తిని పల్లకీలో ఉంచి తుంగభద్ర నదికి తీసుకెళ్లి గంగా పూజల అనంతరం భక్తుల దర్శనార్థం గ్రామంలోని లింగాల ఆలయంలో ఉంచారు. ఆలయ ప్రాంగణంలో రెండు రోజుల పాటు అన్నదానంతో పాటు పలు పూజా కార్యక్రమాలను చేపట్టారు. మూడవ రోజు, బుధవారం గొరవయ్యల ప్రవేశంతో వేడుకలు తారాస్థాయికి చేరుకోగా, గొరవయ్య విన్యాసాలు పలువురిని ఆకట్టున్నాయి. మధ్యాహ్నం అనంతరం ప్రత్యేక పాత్రలలో స్వామివారి అభిషేక పదార్థాలను సేవించే సమయంలో చేపట్టే పాలపూజ పూర్తి వైవిధ్యంగా సాగింది. గొరవయ్యలు పూనకంతో దేవుడు ఆవహించినట్లు ప్రవర్తించి, మల్లయ్య కుక్కలుగా (భైరయ్య) మారి అభిషేక పదార్థాలను నేరుగా నోటితో తీసుకున్నారు. ఇక్కడి వారు భక్తిభావంతో కుక్కలను అనుకరిస్తూ భౌ భౌ అంటూ అరుస్తూ దాదాపు గంటసేపు భక్తి పారవశ్యంతో చేసే విన్యాసాలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం స్వామి వారిని పల్లకీలో లింగాల ఆలయం నుంచి ప్రధాన ఆలయం అయిన దేవర ఇంటికి చేర్చడంతో వేడుకలు ముగిశాయి.

రేపు బుగ్గరామేశ్వరుని హుండీ లెక్కింపు

ఓర్వకల్లు: మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కాల్వబుగ్గలో వెలసిన బుగ్గరామేశ్వర స్వామి దేవాలయంలో ఈ నెల 17వ తేదీన హుండీ ఆదాయం లెక్కించనున్నట్లు ఈఓ మద్దిలేటి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గత మూడు నెలల నుంచి భక్తులు హుండీలో సమర్పించిన కానుకలను దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణలో ఉదయం 10.30 గంటలకు లెక్కింపు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ధర్మకర్తల మండలి మాజీ సభ్యులు తప్పక హాజరుకావాలని కోరారు.

రిజర్వాయర్‌ను నింపి సాగునీరు ఇవ్వాలి

కల్లూరు: చెన్నరాయుని తిప్ప రిజర్వాయర్‌కు నీళ్లు నింపి, పంట కాలువలు ఏర్పాటు చేసి రైతులకు సాగునీటిని అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం కల్లూరు మండలం బొల్లవరం గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హంద్రీనీవా కాలువ నుంచి చెరువులకు నీటిని నింపాలన్నారు. ప్రజా అనుకూలంగా ప్రభుత్వాలు నడవకపోతే ప్రజలే వాటిని మార్చాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చడం లేదని మండిపడ్డారు. రైతులకు అన్నదాత సుఖీభవ ద్వారా రూ.20 వేలు, మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామని చెప్పి ఇవ్వడం లేదని విమర్శించారు. కుటుంబంలో చదువుకుంటున్న పిల్లలందరికీ తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. ఇది ప్రజలను మోసం చేయడమే అన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుంచి వ్యవసాయ రంగానికి ఎలాంటి సహకారం అందడం లేదని, ఎన్నికల ముందు ఒక మాట, తర్వాత మరొక మాట మాట్లాడుతున్నారన్నారు. మండల కార్యదర్శి కృష్ణ, నాయకులు మహేష్, సుదర్శనం, శేఖరు, రిటైర్డ్ డిటీ వెంకట స్వామి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు గౌస్‌దేశాయ్

మత సామరస్యానికి ప్రతీక మీరసావలి ఉరుసు


ఓర్వకల్లు: మండలంలోని హుసేనాపురం గ్రామంలో వెలసిన హజరత్ మీరసావలి నాసర్ షరీఫ్ ఉరుసు మహోత్సవాలు మత సామరస్యానికి ప్రతీకగా నిలిచాయి. సంక్రాతి పర్వదినం సందర్భంగా మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలలో భాగంగా బుధవారం సాయంత్రం స్వాముల వారి కిస్తీ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామ ప్రజలు, రైతులు ఎడ్ల బండ్లను అందంగా అలంకరించి, అన్న ప్రసాదాలను బండ్లలో ఉంచి, ప్రధాన వీధుల గుండా మేళతాళాలతో ఊరేగింపుగా దర్గా వద్దకు చేర్చారు. దర్గాలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, ఫాతేహాలు నిర్వహించి, జెండాలు సమర్పించారు. మంగళవారం రాత్రి మీరసావలి నాసర్ షరీఫ్ దర్గాలో నంద్యాలకు చెందిన సయ్యద్ అజుల్లాఖాన్ ఆలపించిన ఖవ్వాలి పాట, కచేరి భక్తులను ఆకట్టుకుంది. ఉరుసు సందర్భంగా దర్గాను విద్యుత్ దీపాలతో అలంకరించారు. అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా ఎస్ఐ సునీల్‌కుమార్ పర్యవేక్షణలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.



స్వాముల వారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి

కోడుమూరు రూరల్: పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో దుర్భర జీవితాలు గడుపుతున్న ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి ఈశ్వర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కోడుమూరులోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఆటోడ్రైవర్ వర్కర్స్ యూనియన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఈశ్వర్ మాట్లాడుతూ.. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు, డిజీల్, పెట్రోలు ధరలు ఆటో డ్రైవర్లకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయన్నారు. ఓ వైపు పెరిగిన ధరలతో ఇబ్బందులు పడుతుంటే మరో వైపు పుండు మీద కారం చల్లినట్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నూతన రోడ్డు రవాణా చట్టాన్ని తీసుకొచ్చి ఆటో డ్రైవర్ల నడ్డి విరుస్తున్నారన్నారు. నూతనం చట్టం ప్రకారం ప్రమాదాలు జరిగితే ఆటో కార్మికులను జైలుకు పంపి లైసెన్సులు రద్దు చేయడం దారుణమన్నారు. ఆటో కార్మికులకు శాపంగా మారిన జీఓ 21, 31లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికుల సమస్యలపై ఈనెల 30, 31 తేదీల్లో విజయవాడలో జరగనున్న 4వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆయన ఆటో కార్మికులకు పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి రాముడు, ఆటో యూనియన్ నాయకులు మధు, ఓబులేసు, చిన్న, వీరేంద్ర, నాగరాజు, బాషా, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి ఈశ్వర్

వాతావరణ కేంద్రం పనితీరుపై అవగాహన



వాతావరణ కేంద్రం ప్రాధాన్యతను వివరిస్తున్న అధికారులు

కర్నూలు (అగ్రికల్చర్): వాతావరణంలో చోటు చేసుకునే మార్పులపై ఎప్పటికప్పుడు విద్యార్థులు, ఇతర అన్ని వర్గాల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని రాయలసీమ విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు డాక్టర్ డి.పుణ్యశేషుడు సూచించారు. భారత వాతావరణ విభాగం ఏర్పడి బుధవారం నాటికి సరిగ్గా 150 సంవత్సరాలు (1875–2025) పూర్తయిన సందర్భంగా దేశంలోని అన్ని వాతావరణ కేంద్రాల్లో వేడుకలు పెద్ద ఎత్తున నిర్వహించారు. కర్నూలు జిల్లా వాతావరణ కేంద్రంలో నిర్వహించిన ఈ వేడుకలకు రాయలసీమ యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యులు ముఖ్య అతిథిగా హాజరై వాతావరణ విభాగం ప్రాధాన్యతను వివరించారు. వాతావరణంలో తరచూ చోటు చేసుకునే మార్పుల గురించి రైతులు, విద్యార్థులు ఇతర అన్ని వర్గాల ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వివిధ కళాశాలలు, పాఠశాలలకు చెందిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ప్రజలు కూడా 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కర్నూలులోని బిర్లాగేట్ సమీపంలో ఉన్న వాతావరణ కేంద్రాన్ని పరిశీలించి అక్కడున్న వివిధ పరికరాల ప్రాధాన్యతను, అవి పనిచేసే విధానాన్ని తెలుసుకున్నారు. విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలైన వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. వాతావరణ కేంద్రం అధికారులు పి.ప్రభాకర్, నాగలింగమయ్య, అవినాష్ బాబు, రాహుల్, నలిని మోహన్‌రావు, శ్రీనివాసులు, సరోజమ్మ తదితరులు పాల్గొన్నారు.

రామిరెడ్డి తాత ఆరాధనోత్సవం



ఆరాధన మహోత్సవంలో పాల్గొన్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: అవధూత రామిరెడ్డి తాత సేవలు చిరస్మరణీయమని, ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. బుధవారం కల్లూరులో సేవా సంస్థాన్ అధ్యక్షులు దాసరి రామచంద్ర రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరాధనా మహోత్సవం కార్యక్రమానికి కాటసాని రాంభూపాల్‌రెడ్డి, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సాన శ్రీనివాసులు, మైతాపు నరసింహులు, వైఎస్సార్ సీపీ నాయకులు భాస్కర్, కల్లూరు గ్రామ పెద్దలు, యువకులు, భక్తులు పాల్గొన్నారు.

పండుగలు సంస్కృతికి నిలయాలు



ముగ్గుల పోటీ విజేతలకు బహుమతులు అందిస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: పండగలు సంస్కృతి సంప్రదాయాలకు నిలయాలని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా కల్లూరు అర్బన్ 32, 35వ వార్డులలో నిర్వహించిన ముగ్గుల పోటీ కార్యక్రమానికి హాజరై విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. రంగురంగుల ముగ్గులను చూస్తుంటే గ్రామాలు గుర్తుకొస్తున్నాయన్నారు. కార్పొరేటర్ సాన శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నాయకులు శివశంకర్‌రెడ్డి, రంగప్ప, సుధాకర్‌రెడ్డి, భవాని, బసవరాజు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని గార్గేయపురంలో అన్నపూర్ణదేవి విగ్రహం ఒక కన్ను తెరచినట్లుగా కనిపించడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు. గ్రామంలోని గొల్ల వీధిలో సుంకులమ్మ అలయం పక్కన సమారు 240 సంవత్సరాల పురాతన కుంతల స్వామి బావి కలదు. బావికి ఓవైపు గోడలో ఉన్న అన్నపూర్ణదేవి, కాశీవిశ్వేశర స్వామి ఆలయం, కాలభైరవ స్వాములవారికి పూర్వం ప్రతి నిత్యం పూజలు జరిగేవి. ప్రస్తుతం గ్రామస్తులు కార్తీక మాసం, శ్రావణ మాసం, గ్రామ తిరునాళ్ల, పండుగ రోజుల్లో పూజలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో సంక్రాంతి పండుగ సందర్భంగా మంగళవారం ఆలయంలో పూజలు నిర్వహించేందుకు భక్తులు వెళ్లగా శివాలయంలో ఉన్న అన్నపూర్ణదేవి అమ్మవారు ఒక్క కన్ను తెరిచినట్లు భక్తులు గమనించారు. గ్రామస్తులకు విషయం తెలపగా చుట్టు పక్కల గ్రామాలకు తెలియడంతో భక్తులు పెద్ద ఎత్తున వచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. పురాతన బావిలో ఉన్న ఆలయం వద్దకు భక్తులు పోటెత్తడంతో తాలుకా, అర్బన్ పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు. ఆలయంలోని అమ్మవారిని పూజిస్తే సంతానం , ఐశ్వర్యం, పాడి పంటలతో ,గ్రామం సూభిక్షంగా ఉంటుందని, అమ్మవారు రెండు కళ్లు తెరిస్తే గ్రామానికి శుభం, ఒక్క కన్ను తెరిస్తే అశుభం అని గ్రామ శివాలయ పూజారి శివప్రసాద్ శర్మ చెప్పారు. అమ్మవారికి బుధవారం ఉదయం నుంచి గంగపూజ, శాంతిపూజ, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించగా అమ్మవారి కన్నులు పూర్వస్థితికి చేరాయి.



అన్నపూర్ణదేవి ఒక కన్ను తెరచినట్లుగా అగుపిస్తున్న విగ్రహం



అమ్మవారిని దర్శించుకునేందుకు వేచిఉన్న భక్తులు

హంద్రీని రక్షించుకుందాం

కల్లూరు: హంద్రీ నదిని రక్షించుకుందామని హంద్రీ, కేసీ కెనాల్ పరిరక్షణ కమిటీ కన్వీనర్ రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం కల్లూరులోని ఆదిత్య స్కూల్‌లో కల్లూరు పరిరక్షణ సమితి అధ్యక్షుడు చంద్రశేఖరప్ప ఆధ్వర్యంలో హంద్రీ నది పరిరక్షణ ఆవశ్యకతపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. పలువురు వక్తలు హాజరై హంద్రీ నది పరిరక్షణపై చర్చించారు. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. హంద్రీ నది వేలాది ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించడంతోపాటు అనేక గ్రామాలకు తాగునీరు అందిస్తోందన్నారు. నదిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. విశ్వనాథ్ మాట్లాడుతూ.. హంద్రీ నదిలో కంప చెట్లు అడ్డదిడ్డంగా పెరిగాయని మున్సిపల్ అధికారులు చొరవ తీసుకొని వాటిని తొలగించాలన్నారు. మిగతా వక్తలు మాట్లాడుతూ.. హంద్రీ నది పరిరక్షణపై కరపత్రాల ద్వారా ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు ర్యాలీలు చేపట్టి అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలను ఇస్తూ ఉద్యమాన్ని ఉధృతం చేయాలన్నారు. కార్యక్రమంలో శేఖర్‌రెడ్డి, ఫిరోజ్, శేషసాయి, మల్లయ్య, దేవదానం, తారకేశ్వర్‌రెడ్డి, రాజు, రవి, నాగన్న తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హంద్రీ, కేసీ కెనాల్ పరిరక్షణ కమిటీ కన్వీనర్ రామకృష్ణారెడ్డి

●జోరుగా శనగ కోతలు



కోతకు వచ్చిన శనగ పంట



కోడుమూరులో శనగ కట్టెను పీకుతున్న కూలీలు

రబీ సీజన్‌లో ముందస్తుగా రైతులు సాగు చేసిన శనగ పంట కోత దశకు చేరుకుంది. నియోజకవర్గంలోని కోడుమూరు, గూడూరు, సి.బెళగల్ మండలాల్లో సుమారు 12,600కు పైగా హెక్టార్లలో రైతులు శనగ పంటను సాగు చేశారు. ప్రస్తుతం పైరు కోత దశకు చేరుకోవడంతో గత నాలుగైదు రోజుల నుంచి రైతులు శనగ కోతలను మొదలు పెట్టారు. దీంతో గ్రామాల్లో వ్యవసాయ కూలీలకు డిమాండ్ పెరిగింది. ఎకరా శనగ కట్టె పీకడానికి రూ.1400 నుంచి రూ.1600 వరకు కూలీలు డిమాండ్ చేస్తున్నారు. అయితే ఆశించినంతగా దిగుబడులు లేకపోవడంతో కనీసం పంటకు పెట్టిన పెట్టుబడులైనా వస్తాయా అని రైతులు ఆందోళన చెందుతున్నారు.

– కోడుమూరు రూరల్